క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



సత్తెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు నిర్వహిస్తున్న పూజలు

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పేరులేని చెట్టు ప్రాంతంలో ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 11 జంటలు పీటలపై కూర్చుని విశేష పూజలు నిర్వహించారు, ఆలయ గోపురంపై ముందుగా విఘ్నేశ్వరుడి విగ్రహం ప్రతిష్ఠించారు. అనంతరం సత్తెమ్మ తల్లి విగ్రహాన్ని ఆలయ గర్భాలయంలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.

11 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన కోరంగి వలంటీర్లు

తాళ్లరేవు: కోరంగి గ్రామంలోని సచివాలయం -1 పరిధిలో పనిచేస్తున్న 11 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి అర్థాని రామరాజుకు అందజేశారు. వీటిని ఎంపీడీఓకు ఆమోదం కోసం పంపనున్నట్టు రామారాజు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ తాము చేస్తున్న సేవలకు ప్రతిపక్ష నేతలు ఆటంకం సృష్టిస్తున్నారని, కొన్నిచోట్ల వలంటీర్లను వేధించడమే కాకుండా, బెదిరిస్తున్నారని ఆరోపించారు. పింఛను సొమ్ము సకాలంలో అందకుండా చేసి, రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది మరణానికి కారణమైన ప్రతిపక్ష పార్టీల కుటిలయత్నానికి నిరసనగా తాము రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

తాళ్లరేవు: మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మిడివరం స్వతంత్ర అభ్యర్థి అంగాడి రేవతి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చొల్లంగిపేట, పటవల పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.

రామకృష్ణావధానులు మృతికి సంతాపం



రామకృష్ణావధానులు(ఫైల్)

తాళ్లరేవు: ఎంతో మంది విద్యార్థు లకు విద్యాదానం చేసి, మరెంతో మందిని వేద పండితులుగానూ, పురోహితులుగాను తయారు చేసిన బ్రహ్మశ్రీ వేద మూర్తులు తాతపూడి రామకృష్ణావధానులు మృతికి పలువురు సంతాపం తెలిపారు. కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామానికి చెందిన రామకృష్ణావధానులు (96) గురువారం కన్నుమూశారు. ఆయన మృతికి ప్రముఖ వేద పండితులు వేలూరి వేంకట కామేశ్వర శర్మ(కాశిబాబు), పురోహితులు, వేద పండితులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాశిబాబు మాట్లాడుతూ సుమారు వంద మందికిపైగా శిష్యులను వేద పండితులుగానూ, వివాహం, ఉపనయనం, యాగం, యజ్ఞం తదితర దేవతా కార్యక్రమాలు చేసేలా శిష్యులను తీర్చిదిద్దారని కొనియాడారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అంబాజీపేటకు చెందిన మేడేపల్లి ఐర, శ్రీద్రితి రూ.10,116, ముమ్మిడివరానికి చెందిన గ్రంధి సాయి హృతిక్ రూ.10,116 విరాళం అందజేశారు. మొత్తం అన్నదాన పథకానికి రూ.20,232 విరాళం అందినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతలు మేడేపల్లి ఐర, శ్రీద్రితి, గ్రంధి హృతిక్‌లకు ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతలను అభినందించారు.

అడ్మిషన్లు పెంచేలా చర్యలు

కొత్తపేట: రాబోయే విద్యా సంవత్సరం కళాశాలలో అడ్మిషన్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ (సీసీఈ) రాజమహేంద్రవరం రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు సూచించారు. ఆర్జేడీ శోభారాణి శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కళాశాలలో అకడమిక్, ఆఫీస్ వ్యవహారాలను, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ విభాగాన్ని, నూతనంగా నిర్మించిన క్లాస్ రూమ్స్‌ను, కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో నూతన విద్యా ప్రణాళిక, విద్యాభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలని సూచించారు.

హామీలన్నీ నెరవేర్చాం.. మళ్లీ గెలిపించండి

- వైఎస్సార్ సీపీ అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి పినిపే విశ్వరూప్
- కామనగరువు, చిందాడగరువు గ్రామాల్లో ప్రజల బ్రహ్మరథం



చిందాడగరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్



కామనగరువులో ఇంటింటా ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం.. ధైర్యంగా ఓటు వేసి మళ్లీ మమ్మల్ని గెలిపించండి.. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయండంటూ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన రూరల్ మండలంలోని కామనగరువు, చిందాడగరువు గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తొలుత పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఎన్నికల ప్రచార రథంపై నుంచి విశ్వరూప్ ప్రజలకు అభివాదం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన విశ్వరూప్‌కు మహిళలు హారతులిచ్చి, నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా విశ్వరూప్ మట్లాడుతూ ఇంతటి భారీ స్థాయిలో ప్రజా స్పందన ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రజల అనుకూల స్పందన చూసి చాలా ఆనందంగా ఉందని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ దంగేటి డొలమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వర బాబు, సర్పంచ్‌లు నక్కా అరుణకుమారి, పొనాల గణేష్, చెల్లుబోయిన నాని, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజులపూడి మురళీకృష్ణ, నాయకులు రాజులపూడి ఆనంద్, ములపర్తి శ్రీను, ఉర్రింగి నారాయణ, పార్టీ రూరల్ ఉపాధ్యక్షుడు సూదా గణపతి, ఎంపీటీసీ మెండు గంగాభవాని, మాజీ ఎంపీటీసీ రాజులపూడి భాస్కరరావు తదితరులు ఉన్నారు.

మంత్రి విశ్వరూప్‌కు సత్కారం

అమలాపురం టౌన్: పట్టణంలోని మద్దాల వారిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు శుక్రవారం ఘనంగా సత్కరించి, మద్దతు తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి విశ్వరూప్ పూలమాల వేసి, ఆ పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు మెండు రమేష్‌బాబు, గూటం సాయి, మాకే సిద్ధార్థకుమార్, మెండు సురేష్‌బాబు, ములపర్తి వెంకటేశ్వరావు మంత్రిని సత్కరించారు.

నా భర్తను గెలిపించండి

- మా నాన్నను ఆశీర్వదించరూ..
- మంత్రి విశ్వరూప్ భార్య, కుమారుడి విస్తృత ఎన్నికల ప్రచారం



అమలాపురం రెండో వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తున్న బేబీ మీనాక్షి, పార్టీ నాయకులు



అమలాపురం 14వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న డాక్టర్ శ్రీకాంత్, పార్టీ శ్రేణులు

అమలాపురం టౌన్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ భార్య బేబీ మీనాక్షి, కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ అమలాపురం పట్టణంలో వేర్వేరు వార్డుల్లో రెండో రోజైన శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. రెండో వార్డులో బేబీ మీనాక్షి, 14వ వార్డులో డాక్టర్ శ్రీకాంత్ ఇంటింటికీ వెళ్లి, ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. నా భర్తను గెలిపించాలని బేబీ మీనాక్షి, మా నాన్నను ఆశీర్వదించాలని డాక్టర్ శ్రీకాంత్ ఓట్లు అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి అందుతున్న సంక్షేమ లబ్ధిని, మంత్రి విశ్వరూప్ పట్టణాభివృద్ధికి చేసిన కృషిని సమగ్రంగా వివరించారు. ఆయా ప్రచార కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు, చిత్రపు రామకృష్ణ, యండమూరి గంగ, గోపి రాజీ, నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కముజు రమణ, దూడల ఫణి, కల్వకొలను ఉమ, గోపి రమేష్, ఖ్వాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి నామినేషన్ల తిరస్కరణ

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 21 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం 18 మంది అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల అధికారులు ఆమోదించారు. ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వైఎస్సార్ సీపీ డమ్మీ అభ్యర్థి పినిపే బేబీ మీనాక్షి, టీడీపీ డమ్మీ అభ్యర్థి అయితాబత్తుల అరుణ, కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థి అయితాబత్తుల కుమార్‌సింగ్ నామినేషన్లను సాంకేతిక కారణాల వల్ల తిరస్కరించినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు.

ముమ్మిడివరంలో ఐదు..

ముమ్మిడివరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల పరిశీలన అనంతరం ఐదింటిని తిరస్కరించినట్టు ఆర్వో వి.మదన్‌మోహనరావు తెలిపారు. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం నామినేషన్ల పరిశీలన చేశారు. మొత్తం 22 మంది నామినేషన్లు దాఖలు చేయగా, వాటిలో ఐదు నామినేషన్లను తిరస్కరించారు. మొత్తం 17 మంది నామినేషన్లను పరిగణనలోకి తీసుకున్నట్టు ఆర్వో తెలిపారు. అభ్యర్థులు పొన్నాడ నీరజ(వైఎస్సార్ సీపీ), దాట్ల పార్వతిదేవి(టీడీపీ), దాట్ల వెంకట పృథ్వీరాజ్(టీడీపీ), పాలెపు లక్ష్మి(కాంగ్రెస్), దంగేటి మహేష్‌బాబు(ఇండిపెండెంట్) నామినేషన్లను తిరస్కరించారు.

29 నుంచి పాఠశాలలకు సెలవులు

యానాం: నియోజకవర్గ పరిధిలో వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ నెల 29 నుంచి జూన్ 5 వరకూ సెలవులు ప్రకటిస్తున్నట్టు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వీజీ శివగామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్, ఆరోగ్య శాఖ సూచనల మేరకు వేసవి సెలవులను ప్రభుత్వ, ప్రైవేట్, సీబీఎస్ఈ స్కూళ్లకు ప్రకటించినట్టు చెప్పారు. తిరిగి జూన్ ఆరున స్కూళ్లు పునః ప్రారంభమవుతాయని తెలిపారు.

సంక్షేమ పాలన కోసం ఓటేయండి

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పొన్నాడ
- పార్టీ శ్రేణులతో హోరెత్తిన ఎన్నికల ప్రచారం



కప్పలవారిపేట గ్రామస్తులతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ

కాట్రేనికోన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలన కొనసాగేలా, వైఎస్సార్ సీపీని గెలిపించాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందని పార్టీ ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలన్నారు. కందికుప్పలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణతో కలిసి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, యువత ఉత్సాహంగా పాల్గొని, ప్రచారాన్ని హోరెత్తించారు. మండలంలోని కందికుప్ప పంచాయతీలోని మిలటరీపేట, బొజ్జావారిపేట, కప్పలవారిపేట, కందికుప్ప, దొంతికుర్రుపేటల్లో పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. కందికుప్పలో పితాని, పొన్నాడను పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మిలటరీపేటలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రచారం ప్రారంభించారు. పొన్నాడకు మహిళలు పూలు చల్లుతూ, మంగళహారతులతో స్వాగతం పలికారు. పొన్నాడ, పితానితో పాటు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, తమకు అండగా ఉండాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను దేశంలో కేంద్రంతో పాటు, ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్నాయన్నారు. ప్రభుత్వంలో మహిళలకు సముచిత స్థానం కల్పించి, కీలక బాధ్యతలు అప్పగించినట్టు వివరించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా అత్యధికంగా మహిళలే ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. కందికుప్ప మత్స్యకార సొసైటీ సంఘ సభ్యులు, సంఘ అధ్యక్షుడు పాలెపు సత్యం ఆధ్వర్యంలో పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, పితాని బాలకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, సెంట్రల్ డెల్టా చైర్మన్ ఏడిది చక్రపాణిరావు, సర్పంచ్ చల్లగల వెంకటలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏడిది సుబ్బారావు, హితకారిణి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాశి మునికుమారి, పాలెపు ధర్మారావు, వైస్ ఎంపీపీ ఏడిది అరుణ, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ, సంసాని నాగేశ్వరరావు, నాతి అలివేణి, నల్లా బేబి జానకి, కాశి హనుమంతరావు, వర్దాల చిన్నారావు, గెద్దాడ గుణవీణ కుమార్, తిరుకోటి శాంతిసుధ, మోకా చంద్ర నాగరత్నం, గృహసారధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కందికుప్పలో మత్స్యకార సహకార సంఘాల ఆధ్వర్యంలో పొన్నాడ, పితానిలకు సన్మానం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల తనిఖీ



ఈదరపల్లిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చంద్రకాంత్, చిత్రంలో ఏఎస్పీ

అమలాపురం టౌన్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీసు అబ్జర్వర్, కర్ణాటక కేడర్ ఐపీఎస్ అధికారి చంద్రకాంత్ పలువురు అధికారులతో కలసి శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి, జనుపల్లి పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి, ఆయా కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే.. నేరుగా తన వ్యక్తిగత నంబరు 78932 56556కు కాల్ చేయాలని స్పష్టం చేశారు. చంద్రకాంత్ వెంట జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, అమలాపురం రూరల్, పట్టణ సీఐలు పి.వీరబాబు, కె.క్రిష్టోఫర్ ఉన్నారు. అనంతరం శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఎంపిక చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పోలీసు అబ్జర్వర్ చంద్రకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ ఏఎస్పీ బాషా, డీఎస్పీ మహేశ్వరరావుతో స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టూ అవసరమై భద్రత ఏర్పాట్లపై చర్చించారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా సమీక్షించారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత ఉండాలి



గుండెపూడిలో ఉపాధి మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అల్లవరం: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులు పారదర్శకంగా ఉండాలని, ఉపాధి కూలీలకు నమోదు చేస్తున్న మస్టర్లలో తేడాలు ఉండరాదని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని ఎంట్రుకోన, దేవగుప్తం, గుండెపూడి, ఎస్.పల్లిపాలెం, డి.రావులపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో ఉపాధి మస్టర్లను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలు కన్నా ఎక్కువగా మస్టర్లు నమోదు చేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయా పంచాయతీల్లో ఎన్నికల కోడ్ అమలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు తదితర విషయాలపై కార్యదర్శులతో చర్చించారు. పంచాయతీ కార్యదర్శులు పి.శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి, మృదుల, జ్యోతి, మల్లాయమ్మ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

- ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య



తాళ్లరేవు ఎస్ఈబీ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీ శంకరయ్య

తాళ్లరేవు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని విజయవాడ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య ఆదేశించారు. శుక్రవారం మండలంలోని సుంకరపాలెం, పోలేకుర్రు జంక్షన్ వద్దనున్న చెక్‌పోస్టులతో పాటు, తాళ్లరేవు ఎస్ఈబీ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద గస్తీ ముమ్మరం చేయాలని, మద్యం, నాటుసారా అక్రమ తరలింపుపై నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి, పట్టుబడిన మద్యం నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట తాళ్లరేవు ఎస్ఈబీ ఎస్సై టి.చిట్టిబాబు, సిబ్బంది ఉన్నారు.

వరి పంట కోత ప్రయోగం

అంబాజీపేట: ఆరుగాలం పండించిన పంటకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు అంచనా దిగుబడి మొత్తాన్ని తెలుసుకునేందుకు మండలంలో పలు చోట్ల పంటకోత ప్రయోగాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం చిరతపూడిలో రైతు సాగు చేస్తున్న నందిపాటి శ్రీనివాసరత్నకుమార్ పంట భూమిలో 5 (ఇంటు) 5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దాళ్వా పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఎంటీయూ 1121 రకం పంటను కోసి ఒబ్బిడి చేయగా సగటున ఎకరాకు 42 నుంచి 45 బస్తాల చొప్పున దిగుబడి వచ్చిందని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలో 7 వరి పంటకోత ప్రయోగాలు పూర్తి చేశామన్నారు.

పదో తరగతి టాపర్లకు సత్కారం



టాపర్లను సత్కరిస్తున్న డైరెక్టర్ ప్రియదర్శిని

యానాం: నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ హైస్కూళ్లలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను పుదుచ్చేరి పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ప్రియదర్శిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎన్ తేజస్విని(524), ఎస్ దివ్య (537), రాజీవ్‌గాంధీ పాఠశాల విద్యార్థిని పీబీ ఐశ్వర్యాంబిక (564), కేఆర్ఎస్ హైస్కూల్ దరియాలతిప్ప విద్యార్థి ఎం ప్రసాద్ (556), ఎంజీజీబీహెచ్ స్కూల్ విద్యార్థి ఎన్ యోగేష్ (525), ఎస్‌కేఎస్‌పీవీఆర్ఎన్ హైస్కూల్ విద్యార్థి పి వివేక్ (519), కేఎన్‌జీజీ స్కూల్ విద్యార్థిని ఎ చాముండేశ్వరి (505), బీఆర్ అంబేడ్కర్ హైస్కూల్, పరంపేటకు చెందిన ఎం జాన్‌ప్రసాద్ (490)ను ఆమె ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, హెచ్ఎం దంగేటి త్రిమూర్తులు, వివిధ పాఠశాలల టీచర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

- తక్కువగా ఉన్న స్కూళ్ల మూసివేతకు కేంద్రం యోచన
- పుదుచ్చేరి పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ప్రియదర్శిని



గిరియాంపేట స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ప్రియదర్శిని, చిత్రంలో లక్ష్మణ్ ప్రవీణ్

యానాం: నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పుదుచ్చేరి పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఎస్ఏ కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూల్ హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను మూసివేయడానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ యోచిస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో అందరూ విద్యార్థుల సంఖ్యను పెంచడంపై దృష్టి సారించాలన్నారు. 50 మంది కన్నా తక్కువగా ఉన్న స్కూళ్లను మూసివేయడమో లేదా నైబరింగ్ స్కూళ్లలో కలపడమో చేస్తారన్నారు. ఒకే గదిలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే పిల్లవాడి విద్యాభివృద్ధిపై గణనీయ ప్రభావం పడుతుందన్నారు. అదేవిధంగా సీబీఎస్ఈ కరిక్యులమ్ అమలు నేపథ్యంలో ఉపాధ్యాయుల ఇన్ సర్వీసు ట్రైనింగ్ శిక్షణను యానాంలో ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది నుంచి మేక్‌మిల్లన్ గ్రూప్ ఆఫ్ పబ్లికేషన్స్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, రెండేళ్ల పాటు టీచర్లకు ఇన్ సర్వీసు ట్రైనింగ్ ఇస్తారన్నారు. సమావేశంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలల సందర్శన

గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ పాఠశాలను డైరెక్టర్ ప్రియదర్శిని సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల పరిజ్ఞానాన్ని ఆరాతీశారు. వివిధ బోధనా పద్ధతులు, మూల్యాంకన విధానాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. రాజీవ్ గాంధీ స్కూల్, దొమ్మేటిపేట, కనకాలపేట స్కూళ్లనూ ఆమె సందర్శించారు. గెస్ట్ టీచర్లు, ఎస్ఎస్ఏ పారా టీచర్ల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం పంపిణీ చేసే సెంట్రల్ కిచెన్‌ను తనిఖీ చేశారు.

హెచ్ఎంల పోస్టులను భర్తీ చేయాలి

యానాంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గ్రేడ్-1, గ్రేడ్-2 హెచ్ఎంల పోస్టులను భర్తీ చేయాలని, ఇతర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డైరెక్టర్ ప్రియదర్శినికి యానాం యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అందజేశారు. వారు మాట్లాడుతూ సవరించిన అకడమిక్ కేలండర్‌ను ఆమోదించాలని కోరారు. గిరియాంపేట హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున అక్కడి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఎంఏసీపీ ఫిక్సేషన్, ఎరియర్స్, టీజీటీ, పీఎస్‌టీ, బాలవికాస్‌ల ఎరియర్లను తక్షణం చెల్లించాలని కోరారు. ట్రైనింగ్‌లో ఈఎల్, డీడీఓ అధికారాలను డీడీఎస్ఈలకు ఇవ్వాలని, లేకపోతే సీఓఓ పోస్టును అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

డ్రైవింగ్ ట్రైనీలకు సర్టిఫికెట్ల అందజేత



ట్రైనీలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంవీఐ రవికుమార్

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపోలో నిర్వహిస్తున్న హెవీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా ఎనిమిదో బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసిన 16 మంది అభ్యర్థులకు ఎంవీఐ రవికుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. శుక్రవారం అమలాపురం డిపోలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణ కళాశాల డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు, నిర్వహణపై అవగాహన కల్పిస్తారన్నారు. త్వరలో మే చివరి వారంలో తొమ్మిదో బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎండీ రజాక్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్, 73829 09588 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్(మెకానికల్) దేవి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి వరహాలబాబు, సెక్యూరిటీ ఎస్సై రామారావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి బాల వికాస్ ఉచిత వేసవి శిక్షణ

అమలాపురం టౌన్: అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి మే 6 వరకూ బాల వికాస్ ఉచిత వేసవి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు సేవా సంస్థల డివిజన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ తెలిపారు. అమలాపురంలోని సత్యసాయి కల్యాణ మండపంలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ ఈ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఆరేళ్ల నుంచి 16 ఏళ్ల లోపు బాలబాలికలు అర్హులని చెప్పారు. బాలబాలికల్లో భౌతిక, నైతిక, మానసిక, ఆధ్మాత్మిక వికాసం కోసం ఈ శిక్షణ తరగుతులు ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నైతిక విలువలు, కుటుంబ బంధాలు తదితర అంశాలతో పాటు, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, గణితం, ఇతిహాస పురాణాలైన భగవద్గీత, రామాయాణం, భాగవతం, గోమాత విశిష్టత, హనుమంతుడి ఆదర్శం వంటి విషయాలపై శిక్షణ, అవగాహన ఉంటుందని వివరించారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా బాలవికాస్ కేంద్రాల గురువు శిష్టా గుణరంజన్ విజ్ఞప్తి చేశారు.